నేటి దినపత్రిక
# సూర్య
## కర్నూలు | నంద్యాల

గురువారం | 21 డిసెంబర్ 2023 | పేజీలు 8

### నేటి నుంచి శ్రీ మహాలక్ష్మి సమేత మద్దిలేటి స్వామి
### ముక్కోటి ఏకాదశి
# మహోత్సవాలు



**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** లక్షలాది ఆరాధ్య దైవం ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన శ్రీ మహాలక్ష్మి సమేత మద్దిలేటి స్వామివారి ముక్కోటి ఏకాదశి మహెూత్సవాలు ఈనెల 21వ తేదీ గురువారం నుండి 23వ తేదీ శనివారం వరకు నిర్వహించ నున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధి కారి డి. పాండురంగారెడ్డి, ఆలయ చైర్మన్ బి. సీతా రామచంద్రుడు తెలిపారు. ఈ మహెూత్సవాలలో జిల్లా మండల స్థాయి నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

**ఉత్సవ కార్యక్రమాలు :** 21వ తేదీ మార్గశిర మాస శుద్ధ నవమి గురువారం మిగతా 7లో

### జనసేన ఖాతాలో ఆదోని
### కోడుమూరుపై తర్జన భర్జన

### నెలాఖరులోగా
# టిడిపి అభ్యర్థుల ఖరారు



టీడీపీ జెండా

**కర్నూలు, సూర్య ప్రతినిధి: :** జిల్లాలోని ఏడు శాసన సభ, ఒక లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థుల ఖరారు పూర్తయినట్లు తెలుగుదేశం పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీ నేతల అభిప్రాయం ప్రకారం దాదాపు అన్ని స్థానాల్లో ప్రస్తుత ఇన్‌చార్జీలు అభ్యర్థులుగా కొనసాగుతారని తెలుస్తోంది. జనసేనతో కుదిరిన పొత్తు కారణంగా ఆదోని శాసన సభా నియోజకవర్గంలో ఆ పార్టీ అభ్యర్థి బరిలోకి దిగే అవకాశం ఉందని అలాగే భవిష్యత్తులో బిజెపి కలిసి వస్తే కోడుమూరు స్థానంలో ఆ పార్టీకి కేటాయించే అవకాశం ఉందని సమాచారం. ఇక ఆదోనిలో టిడిపి నుంచి టికెట్ ఆశిస్తున్న మీనాక్షి నాయుడు, గుడిసె కృష్ణమ్మలతో టిడిపి చర్చలు జరిపి ఒప్పించే ప్రయత్నం చేస్తారని వెల్లడవుతోంది. ఇక కోడుమూరు టిడిపి ఇన్‌చార్జి ప్రభాకర్ సైతం ఆశ పెట్టుకొని ఉన్నారు. అయితే బిజెపితో పొత్తు వ్యవహారం తేలే వరకు ఏమీ చెప్పలేమని టిడిపి నేతల ద్వారా తెలుస్తోంది. అయితే ఇదే స్థానం నుంచి బరిలోకి దిగాలని కిరణ్మయి అనే మహిళ సైతం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఆమెకు కూడా ఇపుడే ఏమీ హామీ ఇవ్వలేదని టిడిపి వర్గాలు మిగతా 2లో



శిలాఫలకం ప్రారంభం దృశ్యం

**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్ (నాగులదిన్నె) :** 2009 వరదల్లో తుంగభద్ర నదిపై నిర్మించిన వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది.. ఈ నేపద్యంలో నాడు మీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకెశవరెడ్డి ఉమ్మడి ఆంద్రప్రదేశ్ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి వంతె నిర్మాణానికి ప్రతి పాదనలు పంపారు.. పనులు చేయించారు.. రాష్ట్ర విడిపోయ్యాక ఏర్పడిన తెలుగుదేశం పాలకులు వంతెన పూర్తి చెయ్యడానికి నిర్లక్ష్యం వహించారు.. మళ్లీ ఎమ్మెల్యేగా మీరు గెలిపించిన పట్టువదలని విక్రమార్కుడు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి వంతెనకు పట్టిన నిధులు గ్రహణం విడిపించి వంతెన నిర్మాణం సాదించి నేడు మూడు రాష్ట్రాలను అనుసందానం చేసిన ఘనతను దక్కించుకున్నారని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుదవారం నందవరం మండలంలోని నాగులదిన్నె గ్రామం సమీపంలో తుంగభద్ర నదిపై రూ. 42 కోట్లతో నిర్మించిన రెండు తెలుగు రాష్ట్రాలను అనుసందానం చేస్తున్న వంతెనను ఆయన చేతుల మీదుగా మిగతా 2లో

### మూడు రాష్ట్రాల ప్రజలకు అంకితం...
# నాగులదిన్నె వంతెన

- ప్రతిపాదనలు, పనులు, ప్రారంభం అంతా చెన్నకేశవుడి చలువే
- పెద్ద ప్రాజెక్టుల సాధకుడు ఎర్రకోట... బుగ్గన కితాబు
- రూ.42 కోట్ల వంతెన ప్రారంభం
- కదలి వచ్చిన రెండు తెలుగు రాష్ట్రాల నేతలు, ప్రజలు



పూజల్లో నాయకులు




మెగా చెక్కును అందజేస్తున్న దృశ్యం

# పేద విద్యార్థులకు వరం

- జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** పేద విద్యార్థులకు వరం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకమని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం ద్వారా లబ్ధిదారు ఖాతాల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నగదు జమ చేసే బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్, మిగతా 2లో

### మహిళపై
## అత్యాచారం కేసులో
# జీవిత ఖైదు

వార్త 3లో

### ఎస్ఎస్ ట్యాంక్‌కు
# భద్రత ఏదీ..?

వార్త 5లో

### చిరుత దాడిలో
## గొర్రె పిల్ల
# మృతి

వార్త 8లో



పోలీసులతో వాగ్వివాదం చేస్తున్న అంగన్‌వాడి నాయకులు

### అంగన్‌వాడీ కార్మికులు, పోలీసుల మధ్య తీవ్ర
# ఉద్రిక్తత

**పత్తికొండ టౌన్, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, గత 9వ రోజుల నుండి నిరాహారదీక్ష కొనసాగిస్తున్నారు. బుధవారం అంగన్వాడి కార్మికులు, సీఐటీయు ఆధ్వర్యంలో రోడ్డుపైన వంటవార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ దీక్షలకు మిగతా 2లో

- పోలీసులు భయబ్రాంతులకు గురి చేస్తే భయపడే ప్రసక్తే లేదు
- న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటూ మంత్రికి వినతి

సూర్య



# పేద విద్యార్థులకు వరం

(మొదటిపేజీ తరువాయి)

నగర మేయర్ బి.వై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, డీసీఎంఎస్ చైర్మన్ సిహెచ్.శిరోమణిమద్దయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఉన్నత విద్యను విదేశాల్లో చదవాలనే కోరిక ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతను ఇవ్వడంతోపాటు విద్యార్థుల కోరిక నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా చేయూతను అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం జగనన్న జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా లబ్ది పొందిన ముగ్గురు విద్యార్థులకు రూ.9,00,400ల మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మిదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ వర్కర్ల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడి వర్కర్లు

**గడివేముల, మేజర్‌న్యూస్ :** తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని గత ఎనిమిది రోజుల నుండి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఇందుకు నిరసనగా అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు బుధవారం పురవీధులలో భిక్షాటన చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అంగన్‌వాడి వర్కర్లు వసంత లక్ష్మి, రాములమ్మ, రామ చెన్నమ్మలు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో వైసీపి అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలంగాణ ప్రభుత్వం కన్నా అధనంగా జీతాలు అందజేస్తామని హామినిచ్చిన జగనన్న విస్మరించి అంగన్‌వాడీలపై చిన్నచూపు చూస్తున్నాడని ఆవేధన వ్యక్తం చేశారు. అంగన్‌వాడి సెంటర్లను సచివాలయ ఉద్యోగులు తాళాలు పగులగొట్టి ధౌర్జన్యంగా సెంటర్లలోకి ప్రవేశించడం చాలా దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# 1న జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్


మంత్రి పిఏ రమేష్‌రెడ్డికి మెమోరాండం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

**డోన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు గతంలో మాదిరిగానే ప్రతి నెల 1వ తేదిన జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, నంద్యాల జిల్లా జనవిజ్ఞాన వేధిక ప్రధాన కార్యదర్శి మాణిక్యంశెట్టి, డోన్ మండల యుటిఎఫ్ అధ్యక్షులు బివై.సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి గోపాల్, క్రిష్ణగిరి మండల అధ్యక్షుడు రామమూర్తి, ప్యాపిలి మండల యుటిఎఫ్ అధ్యక్షులు కృష్ణనాయక్, ప్రధాన కార్యదర్శి నరసింహరెడ్డిలు కోరారు. 1వ తేదినే జీతాలు చెల్లించాలని కోరుతూ బుధవారం పట్టణంలోని ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కార్యాలయంలో వ్యక్తిగత పిఏ రమేష్‌రెడ్డికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రతినెల 1వ తేదిన జీతాలు ఇవ్వాలని, అలాగే పిఎఫ్, ఏపిజిఎల్ఐ, సరెండర్ లీవ్, పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పక్క రాష్ట్రమైన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తామని మాట ఇచ్చి, మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసినందుకు గాను హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ మాదిరిగానే ఏపి ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాలరంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, షంషాద్‌బేగం, సుమన్, కలాం, రాజశేఖర్, అంజనప్ప, లతీఫ్, చంద్రమోహన్, మురళీకృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరులోగా టిడిపి అభ్యర్థుల ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంటున్నాయి. మంత్రాలయం స్థానం నుంచి కూడా ప్రస్తుత ఇన్‌చార్జి తిక్కారెడ్డి స్థానంలో మరో అభ్యర్థిని బరిలోకి దించవచ్చని సమాచారం. కెడిసిసి మాజీ చైర్మన్ దివంగత మాధవరం రామిరెడ్డి కుమారుడు రామకృష్ణారెడ్డి పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. పత్తికొండ కెయి శ్యాంబాబు, ఆలూరు కోట్ల సుజాతమ్మ, ఎమ్మిగనూరు జయనాగేశ్వర రెడ్డి, కర్నూలు నుంచి టిజి భరత్ పేర్లు టిడిపి అధినేత ఖరారు చేసినట్లు సమాచారం. ఇక కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డికే ఎక్కువ అవకాశం ఉందని అయితే ఆయన అనుభవాన్ని ఉపయోగించుకునేందుకు డోన్ శాసన సభ నుంచి పోటీ చేయించాలన్న ఆలోచన కూడా ఉన్నట్లు వెల్లడవుతున్నా కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి ఆయనను మార్చే అవకాశం చాలా తక్కువ అని వెల్లడవుతోంది. శాసన సభకు వెళ్లేందుకు కోట్ల సూర్య కూడా సుముఖంగా లేరని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అంశం తేలేందుకు స్వయంగా చంద్రబాబు, కోట్ల సూర్యలు కూర్చొని చర్చించిన తరువాతే తుది నిర్ణయం జరుగుతుందని స్పష్టమవుతోంది. మొత్తం మీద ఎన్నికల వేడి రాజుకుంటున్న తరుణంలో రెండు ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక దాదాపు పూర్తి చేశాయి. వీరంతా కొత్త సంవత్సరంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

# అంగన్‌వాడీ కార్మికులు, పోలీసుల మధ్య తీవ్ర ఉద్రిక్తత


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడి నాయకులు, సీఐటీయు నాయకులు

(మొదటిపేజీ తరువాయి)

టీడీపీ మద్దతు తెలియజే శారు. పత్తికొండ గోపాల్ ప్లాజలో నియోజకవర్గ అధికారుల సమీక్ష సమావేశానికి ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ఎమ్మెల్యే శ్రీదేవి జిల్లా కలెక్టర్ సృజన హాజరయ్యారు. విషయం తెలుసుకొన్న సీఐటీయు నాయకులు, అంగన్‌వాడి కార్మికులు, టీడీపీ నాయకులు దీక్ష శిభిరానికి చేరుకొని ర్యాలీ నిర్వహిస్తుండగా, అంగన్‌వాడి కార్మికుల ర్యాలీని పోలీసులు చుట్టుముట్టి రోడ్డుపై అడ్డగించి అంగన్‌వాడి కార్మికులను, పోలీసులను చెల్ల చెదురు చేశారు. పోలీసులు, అంగన్వాడి కార్మికుల మధ్య తోపులాట జరగడంతో తీవ్ర ఉద్రిక్తత చేటు చేసుకొని గోపాల్ ప్లాజా గేట్ వేయడంతో అక్కడ పోలీసులకు టీడీపీ, సీఐటీయు, అంగన్‌వాడి కార్మికులకు తోపులాట జరిగి గేటు ఎక్కడానికి మహిళలు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు భయపడే ప్రసక్తే లేదని అంగన్‌వాడి నాయకురాలు తెలిపారు. మంత్రిని కలిసేంతవరకు వెళ్లే పరిస్థితి లేదని పోలీసులకు తేల్చి చెప్పారు. అనంతరం మంత్రి బయటకు రావడంతో మంత్రి రాజేంద్ర నాథ్‌రెడ్డికి కనీస వేతనాలు ఇవ్వాలని, రూ.26వేలు ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం, న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని మంత్రికి విన్నవించుకొని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా జీతాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సమస్యలుంటే రాష్ట్రప్రభుత్వానికి తెలియజేస్తామని దాట వేశారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడి కార్మిక నాయకురాలు కాంతమ్మ, శోభ, పద్మజ, షాజాహన్, సీఐటీయు మండల కార్యదర్శి గోపాల్, వెంకటేష్‌రెడ్డి, సురేంద్ర, వినోద్, తుగ్గలి మండల కార్యదర్శి శ్రీరాములు, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బత్తిన వెంకట్రాముడు, సోమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

# ఓట్ల జాబితాలోని అవకతవకలను సరి చేయండి

## ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

**డోన్, మేజర్‌న్యూస్ :** ఓట్ల జాబితాలోని అవకతవకలను సరిచేయాలని ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం డోన్ తహాశిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ఓట్ల నమోదు, తొలగింపు, కొత్త ఓట్ల నమోదు ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఎక్కడో ఒక చోట తప్పులు ఉంటాయని, ఎన్నికల సమయానికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరు వారి ఓటును వినియోగించుకునేలా సక్రమంగా ఓటరు జాబితాలో సవరణలు చేయాలని ఆదేశించాలు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్‌డిఓ వెంకట్‌రెడ్డి, తహాశిల్దార్ విద్యాసాగర్, అధికారులు ఉన్నారు.

## మూడు రాష్ట్రాల ప్రజలకు అంకితం...

# నాగులదిన్నె వంతెన

(మొదటిపేజీ తరువాయి)

ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు నియోజక వర్గ ప్రజలు చేసుకున్న పుణ్యంతోనే మీకు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ఎమ్మెల్యే ఉన్నారన్నారు. 85 ఏళ్లు పైబడిన అయన ఆలోచనలు అన్నీ దూరదృష్టితో , ముందుచూపుతో ఉంటాయని అందువల్లే ఈ ప్రాంతం సాగు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు ప్రజలకు ఇబ్బంది లేని రహదారులు ఏర్పాటు చెయ్యడమే లక్ష్యంగా పాలన అందించిన ఘనతను దక్కించుకున్నారన్నారు. పులికనుమ, గురురాఘవేంద్ర, ఆర్‌డిఎస్ కుడికాలువ, ఏపిఎస్ ఐడిసి పథకాలు, గాజులదిన్నె ఎత్తు పెంపు, ఇలా పెద్ద ప్రాజెక్టుల సాదకుడని కితాబు ఇచ్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాల్లో తుంగభద్రనదిపై నాగులదిన్నె వంతెన , గోనెగండ్ల మండలంలో తిప్పనూరు వంతెనలు పూర్తి చేయించడమే కాక నిన్నటికి నిన్న గంజిల్ల వంతెనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఒప్పించి రూ 44 కోట్లతో హంద్రి నదిపై మరోవంతెనను సాదించారని గుర్తు చేశారు. 85 ఏళ్ల వయస్సులో ఎర్రకోట చేస్తున్న సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయన్న బావం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో


రిబ్బన్ కట్ చేస్తున్న మంత్రి , జెడ్‌పి చైర్మన్

సబ్‌కలెక్ట్ అభిషేక్ కుమార్, తాశీల్ధారు నిత్యానందరాజు, ఎంపిడిఓ దశరతరామయ్య, ఈఓఆర్‌డి ఈశ్వరయ్య, రోడ్లు భవనాలు శాఖ పర్యవేక్షకులు నాగరాజు , వైకాపా నేతలు బుట్టారంగయ్య, కొమ్ము రాజశేఖర్, రియాజ్, నజీర్ అహమ్మద్, దర్మకారి నాగేశ్వరరావు, వివిద


తుంగభద్ర నది ప్రవాహం పరిశీలిస్తున్న నేతలు

ప్రాంతాల నుండి పెద్దెత్తున తరలివచ్చిన వైకాపా శ్రేణులు పాల్గొన్నారు.

**నది ప్రవాహం పరిశీలన.. రభి సాగును నిలిపేయ్యండి**

ఉమ్మడి కర్నూలు జిల్లాకు జలనాడి అయిన తుంగభద్రమ్మ ప్రవాహంను రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మంత్రి బుగ్గన, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే ఎర్రకోట, అలంపూరు ఎమ్మెల్యే విజయుడు, కలెక్టర్ సృజనలు పరిశీలించారు.. తాగునీటి అవసరాల నిమిత్తం ఇకపై రైతులు రభి పంటలను సాగుచెయ్యవద్దని హెచ్చరించారు.. ఈ ఏడాది వర్షాలు లేక జలాశయాలు నిండలేదని నదిలో నీరు ఇంకి పోయె పరిస్థితులు ఉన్నాయంతూ పంటలు నష్టపోవడం జరుగుతుందని గ్రహించాలన్నారు.

**ఘనంగా స్వాగతం..**

రెండుతెలుగు రాష్టాలను అనుసందానం చేసిన నాగులదిన్నె వంతెన ప్రారంభానికి విచ్చేసిన మంతి బుగ్గన, జెడ్‌పి చైర్మన్ ఎర్ర బోతుల పాపిరెడ్డి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్న కేశవరెడ్డి, తనయుడు వైకాపా నేత ఎర్ర కోట జగన్మోహన్‌రెడ్డి , తెలంగాన రాష్ట్రం అలంపూరు ఎమ్మెల్యే, విజయుడు, కలెక్టర్ సృజన లకు నాగులదిన్నె వంతెన దగ్గర ఘన స్వాగతం అందింది.. మండల పైసిపి అద్య క్షులు శివారెడిగౌడు, జిల్లా వైకాపా కార్యదర్శి కెఆర్ అక్ష్మికాంతరెడ్డి నాగులదిన్నె సర్పంచ్ లక్ష్మి, ఆర్ అండ్‌బి ఎస్‌ఈ నాగరాజు, ఎంపిటిసిలు అతవుల్లా, బుగడే యల్లమ్మ, శరత్‌కుమార్, తిమ్మప్ప, రంగారెడ్డి, ఉప సర్పంచ్ బొంబాయి రాజులు స్వాగతం పలికారు.

# అంతర్ రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు-28 తులాలు బంగారం రికవరీ


చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్‌:** నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌లు చేసిన నింధితుడిని నంద్యాల పోలీసులు అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాకు చెందిన ఇరాని గ్యాంగ్ సభ్యుడైన అర్బాజ్ అలిని పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి నింధితుడిని మీడియా ముందు హాజరు పరచి వివరాలను వె ల్లడించారు. నింధితుడు అర్బాజ్ అలి సబ్ డివిజన్‌లో 5 స్నాచింగ్‌లు, జిల్లాలోని డోన్ సబ్ డివిజన్‌లో 3 స్నాచింగ్‌లు, కర్నూలులో 4, అనంతపురం జిల్లాల్లో 4 స్నాచింగ్ కేసుల్లో నింధితుడన్నారు. ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లే మహిళలు, కిరాణ కొట్టుల్లో ఒంటరిగా వుండే మహిళలను టార్గెట్ చేసి వారితో మాట్లాడినట్లు నటిస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవారన్నారు. నంద్యాల టౌన్ డీఎస్పీ మహేశ్వర రెడ్డి నేతృత్వంలో త్రీ టౌన్ సీఐ నరసింహులు, క్రైం బ్రాంచ్ సీఐ సాదిక్ అలి, ఎస్‌ఐలు రాంమోహన్ రెడ్డి, బాబు, విజయ్‌లు సిబ్బందితో ప్రత్యేక టీంగా ఏర్పడి చైన్ స్నాచర్లపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని ప్రథమ నంది దేవస్థానం పరిసరాల్లో నింధితుడు అర్బాజ్ అలి ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నింధితుడి నుండి సుమారు 29 తులాల బంగారు ఆభరణాలను, నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ కనపరచిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# వర్క్‌ఫ్రం హోమ్ పేరిట ఆన్‌లైన్ మోసం

**నందికొట్కూరు, మేజర్‌న్యూస్‌:** నందికొట్కూరు పట్టణానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్‌లో వర్క్‌ఫ్రం హోమ్ జాబ్ కోసం దరఖాస్తు చేసే ప్రయత్నంలో మోసపూరిత లింక్‌పై క్లిక్ చేయడంతో దాదాపు రూ.2లక్షలు పోగొట్టుకున్నారు. దీనిపై సైబర్ క్రైం విభాగంలో ఫిర్యాదు చేయడంతో మోసం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు తెలిపిన వివరల ప్రకారం నందికొట్కూరు పట్టణానికి చెందిన ఓ మహిళ వర్క్ ఫ్రం హోమ్ ద్వారా సంపాదించే అవకాశాన్ని కల్పిస్తామనే ప్రకటనతో వున్న సోషల్ మీడియా పోస్టును చూసి ఆసక్తితో దానిపై క్లిక్ చేసి అందులో రిజిస్ట్రేషన్ అయ్యారు. వర్క్‌ఫ్రం హోమ్ జాబ్ కోసం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న తర్వాత నిర్వాహకులు ఆమెతో పాటు నలుగురిని కలిపి వీఐపి డి అనే ఒక టెలిగ్రామ్ గ్రూపును క్రియేట్ చేశారు. తరువాత నిర్వాహకులు ఆమెతో పాటు మరో నలుగురిని కలిపి విఐపి డి అనే ఒక టెలిగ్రామ్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. తరువాత గ్రూప్ సభ్యులు పూర్తి చేయాల్సిన టాస్క్ అంటూ లింక్‌ను పంపించారు. టాస్క్ అంటే నిర్వాహకులు పంపిన వ్యాపార పరమైన వీడియోలు చూడడం వాటిని లైక్ చేయడం, షేర్ చేయడం లాంటివి షేర్ చేయాల్సి ఉంటుంది. వారు సూచించిన టాస్క్ పూర్తి చేయాలంటే కొంత డబ్బు తమకు డిపాజిట్ చేయాలని, టాస్క్ పూర్తిచేస్తే వారికి డబ్బుతో పాటు అదనంగా కమీషన్ చెల్లిస్తామని ఉద్యోగంలో ఇదంగా భాగమని న మ్మించారు. ప్రారంభంలో టాస్క్ పూర్తి చేసిన తర్వాత డబ్బు చెల్లించారు. దీంతో నమ్మకం కుదిరిన బాధితురాలు 18 టాస్క్‌ల వరకు పూర్తి చేశారు. దీనికోసం ఆమె విడతల వారిగా రూ.1లక్ష 80వేలు ఆన్‌లైన్ వెబ్‌సైట్ నిర్వాహకులకు చెల్లించారు. టాస్క్‌లు పూర్తవుతున్నా నిర్వాహకులు చెల్లిస్తామన్న డబ్బు చెల్లించకపోగా తాము డిపాజిట్ చేసిన డబ్బును విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నించినా బాధితురాలికి వీలు కాకపోవడంతో ఆమె ఫోన్‌లో నిర్వాహకులను నిలదీశారు. దీంతో నిర్వాహకులు మరో రూ.17వేలు చెల్లించాలని అలా చేస్తే బాధితురాలు డిపాజిట్ చేసిన రూ.1లక్ష 80వేలు తిరిగి చెల్లిస్తామని తెలపడంతో మోసపోయానని గ్రహించి ఆమె భర్త సహాయంతో ఈ విషయంపై కర్నూలులోని సైబర్ క్రైం విభాగంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు బాధితురాలు అందించిన వివరాల సహాయంతో మోసగాళ్ల బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేశారని, వీలైనంత మేరకు తాము కోల్పోయిన సొమ్మును రికవరీ చేసే ప్రయత్నం చేస్తామని పోలీసులు తెలిపినట్లు బాధితురాలి భర్త అన్నారు.

డాక్యుమెంటు పోయినది

నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం,గ్రామం డోర్ నెంబర్ 2/323,నివసించు పోరెడ్డి రామకృష్ణారెడ్డి S/O రామ చంద్రారెడ్డి అను నేను 2023 నవంబర్ 05 తేదిన జిరాక్స్ కోసం ఇంటి నుండి బయలుదేరి వెళ్లుతుండగా ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోగొట్టుకొని పోయినాయి. డాక్యుమెంటు నెంబర్6650/1999 ఎవరికైనను దొరికిన ఎడల ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయండి..

ఫోన్ నెంబర్..+91 8106364877

# ఒత్తిడి తట్టుకోలేక బీటెక్ విద్యార్థి బలవన్మరణం

**కర్నూల్ క్రైమ్ మేజర్ న్యూస్ :** కుటుంబ సమస్యలు ఆర్థిక ఇబ్బందులు కారణంగా బీటెక్ విద్యార్థి బలవన్ మరణానికి పాల్పడిన సంఘటన నగరంలో చోటుచేసుకుంది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దికెర మండలం అగ్రహారం గ్రామానికి చెందిన సాయికుమార్ 19 సంవత్సరాలు అనే విద్యార్థి నగరంలోని పెద్దపడకానాలో నివాసం ఉంటూ బీటెక్ చదువుతున్నాడు. గత కొన్ని రోజులుగా కుటుంబ సమస్యల కారణంగా ఇబ్బంది పడుతూ ఉండేవాడని 18 వ తారీఖున పాయిజన్ తీసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానికులు బంధువులు స్థానిక ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం తరలించగా కోలుకోలేక మంగళవారం రాత్రి చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వన్ టౌన్ సిఐ పవన్ కుమార్ ఆసుపత్రికి వెళ్లి విచారణ జరిపారు. తండ్రి బాలరంగడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# విద్యుత్ ఆదాచేసి భావితరాలకు భరోసా ఇద్దాం

**గోనెగండ్ల,మేజర్‌న్యూస్:** ప్రస్తుత కాలంలో విద్యుత్‌ఆదా చేసి భావితరాలకు భరోసా ఇద్దామని విద్యుత్ ఏడీఏ శాంతిస్వరూప్ అన్నారు. ఈ నెల 13 నుంచి 20వ తేదివరకు జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో బాగంగా బుధవారం గోనెగండ్లలోని మోడల్ స్కూల్ నందు విద్యార్థులకు విద్యుత్ పొదుపు పై వ్యాసరచన, పక్కృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు షీల్డ్, ప్రశంశాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శాంతి స్వరూప్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఇందనపొదుపు గురించి తెలుసుకోవలసిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇండ్లలో ఎవ్వరు లేని సమయాలలో ఏసీలు, ప్యాన్లు బల్బులు ఆఫ్ చేసుకొవాలని గ్రైండర్లు, కుక్కర్లు జాగ్రత్తగా వాడుకొని విద్యుత్ పొదువుగా వాడుకొని విద్యుత్ను పొదుపు చేయాలన్నారు. విద్యుత్ వాడకాలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న విద్యుత్ ఏడీఏ శాంతిస్వరూప్

ఈకార్యక్రమంలో ఏఈ సుధాకర్, ట్రాన్స్ఫార్మర్ ఏఈ సరేష్కుమార్, సుబాష్ చంద్రబోష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షహానా పర్విన్, సిబ్బంది పాల్గొన్నారు.

# భిక్షాటన చేసిన అంగన్‌వాడీ టీచర్లు

**మహానంది, మేజర్‌న్యూస్‌:** మహానంది మండల అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు భిక్షాటన చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. బుధవారం అంగన్‌వాడీలు చేపడుతున్న రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా వారి ఈ వినూత్న నిరసనను వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తమకు జీతాన్ని పెంచుతూ రిటైర్‌మెంట్ పించన్ అలవెన్స్‌లను వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా మహానంది దేవాలయం వద్ద భక్తులను, చిరు వ్యాపారస్తుల వద్ద భిక్షాటన చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.






## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు - ఒకరి పరిస్థితి విషమం


తీవ్రంగా గాయపడ్డ పెద్ద ఈశ్వర్ రెడ్డి

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండలంలోని గొడెగనూరు గ్రామ సమీపంలో బుధవారం మోటర్ సైకిల్,కారు డీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని కొత్తపల్లెకు చెందిన పెద్ద ఈశ్వర్ రెడ్డి,పుల్లారెడ్డిలు ద్విచక్ర వాహనంలో కొత్తపల్లె నుండి ముత్యాలపాడుకు వెళుతుండగా అహొబిళం నుండి పోరుమామిళ్లకు వెలుతున్న కారు మోటర్ సైకిల్‌ను డీ కొంది.దీంతో మోటర్ సైకిల్ పై వెలుతున్న ఈశ్వర్రెడ్డి,పుల్లారెడ్డి లు తీవ్రంగా గాయపడ్డారు.గాయపడ్డ వీరిని చాగలమర్రి పట్టణంలోని కేరళ వైద్యశాలకు తరలించారు.పెద్ద ఈశ్వర రెడ్డి పరిస్థితివిషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

# మహిళపై అత్యాచారం కేసులో జీవిత ఖైదు

**నంద్యాల క్రైం, మేజర్‌న్యూస్ :** నంద్యాలలో మహిళపై జరిగిన అత్యాచారం కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ ప్రత్యేక న్యాయ స్థానం తీర్పు ఇచ్చింది. 2017లో నంద్యాల మండలంలోని క్రాంతినగర్ నందు మానసిక స్థితి సరిగ్గా లేని మహిళను వరుసకు చిన్నాన్న ఇంటిలోకి టివి రిమోట్ కొరకు వెళ్ళగా మద్యం మత్తులో పట్టుకొని అత్యాచారం చేసినట్లు ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం కర్నూలులో మహిళలపై నేరాలకు ప్రత్యేక న్యాయ స్థానం, ఏడవ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి భూపాల్‌రెడ్డి నిందితుడు తలారి సంజీవ (41) నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ రూ. 2 వేలు జరిమాన విధించినట్లు జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు.

# బిందుసేద్యంతో రైతులు పంటలు సాగుచేసుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న ప్రతినిధి అబ్దుల్‌రహిమాన్

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్‌:** బిందుసేద్యం విధానంలో రైతులు కూరగాయాలు ఇతర పంటలను సాగుచేస్తే మంది దిగుబడులు, లాభాలు పొందవచ్చని రివులిస్ ఇరిగేషన్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి అయిన అబ్దుల్‌రహిమాన్ తెలిపారు. బుధవారం మండలంలోని రైతుభరోసా కేంద్రంలో రైతులకు బిందుసేద్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌ఏ ప్రమీలారెడ్డి, విఏఏ ప్రణీత, డ్రిప్ కంపెనీ డిసిఓ కృష్ణయ్య, ఎఫ్ఓ రామకృష్ణ, కంపెనీ ప్రతినిదులు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్ర క్రీడలను వేగవంతం చేయండి



**చాగలమర్రి,మేజర్ న్యూస్:** రాష్ట్రంలోని జగనన్న ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని గ్రామీణా ప్రాంతాలలో ఉండే ప్రతిభగల యువతను వెలికి తీసి జాతీయ స్థాయి క్రీడలలో ప్రాతినిథ్యం కల్పించటానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ మహబుబ్ దౌలా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నుండి నిర్వహించనున్న ఆడుదా-ఆంధ్ర క్రీడలలో మండలంలోని 17 సచివాలయాల పరిథిలో సూమారు 3802 మంది తమ పేర్లను 5 క్రీడాంశాలలో నమోదు చేసుకున్నారు. ఈ క్రీడల ను నిర్వహించేందుకు మండలంలోని ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యా యులు, అధ్యాపకులతో మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశా న్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆయా సచివాలయాల పరిధిలోని క్రీడా మైదానాలు, కోర్టుల ఏర్పాటు, పోటీలు నిర్వహించనున్న అంశాలలో టీంల ఏర్పాటు. ఆయా క్రీడలలో ఆటల పోటీలను నిర్వహించటానికి కావలసిన మౌళిక సదుపా యాలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యా.అధ్యాపకులు పాల్గోన్నారు.

# గజ్జహళ్ళికి విద్యార్థి బస్సును నడపాలని వినతి

**హొళగుంద,మేజర్‌న్యూస్ :**

హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు ఆదోనికి వెళ్లి వస్తారని విద్యార్థుల కోసం గ్రామానికి విద్యార్థి బస్సును నడపాలని బిజేపి కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యాదర్శి చాకలి రామలింగ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ అధికారికి వినతిపత్రం సమర్పించారు.చదువుకోవడానికి ఆదోనికి వెళ్లి రావడానికి విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని విషయం జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ దృష్టికి తీసుకెళ్ళగా ఆదోని డిపో అసిస్టేంట్ అధికారిని కలిసి విన్నమించినట్లు రామలింగ తెలిపారు.గ్రామానికి ఉదయం సాయంత్రం వేళలో వెంటనే బస్సును నడపాలన్నారు.ఈ కార్యాక్రమంలో బిజేపి జిల్లా ప్రధాన కార్యాదర్శి ఉపేంద్రకుమార్,అధికార ప్రతినిధి ఆదూరి విజయ్‌కృష్ణ,జిందేసాయికుమార్,మహమ్మద్ ఆలీశివకుమార్,దేవరాజ్,రవికుమార్,శరణ్‌కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

# సృష్టిలో 'తల్లి ' అనే పదం అమూల్యమైనది

**శ్రీ శాంతినికేతన్ విద్యా సంస్థల అధినేత సుధాకర్**
**శ్రీ సంకల్ప్ పాఠశాలలో సూపర్ స్టార్ లిటిల్ స్టార్ ' కార్యక్రమం**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** సృష్టిలో 'తల్లి'అనే పదం అమూల్యమైనది.శ్రీశాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ అన్నారు. బుధవారం సంజీవ నగర్ లోని శ్రీ సంకల్ప్ పాఠశాలలో 'సూపర్ స్టార్ లిటిల్ స్టార్ ' కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీ శాంతినికేతన్ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తల్లి– బిడ్డల అనుబంధం గురించి వివరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ మనిషి పుట్టుకకు కారకురాలైన తల్లి తొలిదైవమని, తల్లి ఆలనా పాలనలో బిడ్డ ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకోవడం జరుగుతుందన్నారు. సృష్టిలో 'తల్లి ' అనే పదం తీయనైనదని, అమూల్యమైనదని, ఎన్ని జన్మలెత్తినా తల్లి రుణం తీర్చలేని ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు. తల్లి ప్రేమ ముందు అమృతం కూడా తక్కువేనని శిశువైనా, పశువైనా తల్లి ఒడి చేరవలసిందేనని వివరించారు. అమ్మ ఒడిని మించిన భద్రత బిడ్డకు ఎక్కడా ఉండదని వివరించారు.ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులు మరియు వారి తల్లులు కలసి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అబ్బురపరిచాయి. విద్యార్థులు, వారి తల్లులు అధికసంఖ్యలోపాల్గొని కార్యక్రమమును విజయవంతం చేశారు.

# వైసీపీ ప్రభుత్వం మాయ మాటలు చెప్పింది

**– అంగన్‌వాడీలను గాలికి వదిలేశారు**
**– ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి**
**– కాతా రమేష్‌రెడ్డి**



మాట్లాడుతూ కాతా రమేష్‌రెడ్డి

**మిడ్తూరు, మేజర్‌న్యూస్ :** ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ అంగన్‌వాడీలు మిడ్తూరు మండల కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా బుధవారం సమ్మె నిర్వహించారు. ఈ సమ్మెకు కాతా రమేష్‌రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నంలు హాజరయ్యారు. అనంతరం కాతా రమేష్‌రెడ్డిలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మాయ మాటలు చెప్పి అంగన్‌వాడీల సమస్యలను గాలికి వదిలేశారని 9 రోజులుగా సమ్మె చేస్తుంటే పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా కళ్ళు తెరచి అంగన్‌వాడీల హామీలను నెరవేర్చి ఈ నిరసన దీక్షను విరమింప చేయాలని ఆయన కోరారు. ఇచ్చిన హామీల్లో వేతన బకాయిలు, వంట గ్యాస్ బిల్లులు, గ్రాట్యూటి, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పదవి విరమణ ప్రయోజనం క్రింద రూ. 5 లక్షలు ఇవ్వాలన్నారు. హెల్పర్స్‌ను పర్మినెంట్ చేయడంతోపాటు రూ. 26 వేలు జీవం ఇవ్వాలన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే తెలంగాణా ఉద్యోగుల కంటే రూ. 1000 ఎక్కువ ఇస్తామని పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు వంగాల శివరామిరెడ్డి, రమణారెడ్డి, వెంకటరామిరెడ్డి, టి. సుభాన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఫక్కీర్ సాహెబ్, సంపంగి వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు మద్దిలేటి, లింగస్వామి, రైతు సంఘం నాయకులు ఓబులేసు, సుజ్ఞానం, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బమ్మ, లక్ష్మీకుమారి, ఉమాదేవి, తదితర అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గౌరవ వేతనాల కోసం బీఎల్‌ఓల ఎదురు చూపులు

**– ఉమ్మడి జిల్లాలకు బడ్జెట్ మంజూరై రెండు నెలలైనా జాప్యం**
**– ఎన్నికల విధుల్లో చేతినుండి ఖర్చు పెట్టుకుంటున్న బీఎల్‌ఓలు**



ఎన్నికల విధులలో బూత్ లెవల్ అధికారి (దాచిన చిత్రం)

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ః** ఎన్నికల సంఘం తమ ఎన్నికల విధులు నిర్వహించడానికి ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక బీఎల్‌ఓను నియమించి పనులను నిర్వహించుకుంటుంది. అందుకోసం ప్రతి బీఎల్‌ఓ అధికారికి కొంతమేర గౌరవ వేతనం ఇచ్చి తోడ్పాటునిస్తుంది. కానీ ఇపుడు తాము నిర్వహించిన ఎన్నికల విధులకు సంబంధించిన గౌరవ వేతనం కోసం బీఎల్‌ఓలు ఎదురు చూడాల్సిన పరిస్థితి రెండు ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఏర్పడింది. శ్రీశైలం నియోజకవర్గ వ్యాప్తంగా 226మంది బీఎల్‌ఓలను, బండి ఆత్మకూరు మండల వ్యాప్తంగా 45మంది బీఎల్‌ఓలను నియమించి ఎన్నికల విధులను నిర్వహించుకుంటుంది. ప్రతి పోలింగ్ బూత్‌కు సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులు తమ గ్రామ రెవెన్యూ అధికారులతో పాటు అక్కడక్కడా పంచాయితి కార్యదర్శులతో ఎన్నికల కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఎన్నికల సంఘం ఆదేశానుసారం గత ఆరు నెలల నుండి శని, ఆదివారాలలో ప్రత్యేక ఓటరు క్యాంపులను నిర్వహించి ఓటరు నమోదు, ఓటరు తొలగింపుల కార్యక్రమాలు బీఎల్‌ఓలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఎలక్షన్లు సమీపించే కొద్ది స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించడానికి ఫారం–7ఏ, ఫారం–7బిలనుతీసుకువచ్చిఓటర్ల మార్పులు, చేర్పులు, మరణించిన ఓటరు తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టింది. వీటికోసం ప్రింటింగ్ ఖర్చులు, అప్లికేషన్ల ఖర్చులు తామే సొంతంగా భరాయిస్తున్నామని ఒక్కొక్క బీఎల్‌ఓకు దాదాపు రూ.వేయి నుండి రూ.2వేల వరకు చేతినుండే పెట్టుకుంటున్నట్లు తెలిపారు. దీనికి అదనంగా గ్రామాల నుండి రెవెన్యూ కార్యాలయాలకు తిరగడానికి మరింత ఖర్చు ఏర్పడుతుందని గత రెండున్నరేళ్లుగా గౌరవ వేతనం మంజూరు కాలేదని తెలిపారు. మండల, డివిజన్ స్థాయి ఎన్నికల అధికారులకు పలు కార్యక్రమాల ద్వారా సమస్యను తెలిపినా ఇప్పటికీ మంజూరు కాలేదని వాపోతున్నారు. ఇదిలా వుండగా కర్నూలు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించడం కోసం రెండు నెలల క్రిందటనే బడ్జెట్ మంజూరైందని విశ్వసనీయ సమాచారం. అప్పటి నుండి ఇప్పటి వరకు సంబంధిత బడ్జెట్‌పై జిల్లా ఉన్నతాధికారులతో పాటు ఎన్నికల అధికారులు కూడా దృష్టి సారించక పోవడంతో గౌరవ వేతన విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుందని ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని బీఎల్‌ఓలకు గౌరవ వేతనాలు అందేలా రెండు జిల్లాల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సిబ్బంది కోరుతున్నారు.

# పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం

**గడివేముల, మేజర్‌న్యూస్ః**

పార్టీకోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు యువనేత కాటసాని శివ నరసిం హారెడ్డి అన్నారు. బుధవారం గడివేముల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కొర్రపోలూరు, దుర్వేశి, తిరుపాడు గ్రామాల కు చెందిన గ్రామస్థాయి కార్యకర్తలు, నాయ కులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన ప్రతి ఒక్కరు సంతృప్తి స్థాయిలో వున్నారని ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని నరసింహా రెడ్డి

సమీపిస్తున్న వేళ ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేసి వైయస్ఆర్‌సీపి పార్టీ విజయానికి దోహదపడాలని అన్నారు. కార్యకర్తలలో చిన్న చిన్న మనస్పర్థలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి కార్యకర్త సంక్షేమమే తమ లక్ష్యమని గత 30 సంవత్సరాల నుండి రాజకీయంలో ఎల్లవేళలా సహకరిస్తున్న కార్యకర్తల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాణ్యం టిక్కెట్ ఎవరు ఆశించినా కాటసాని రాంభూపాల్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఆర్‌బి చంద్రశేఖర్ రెడ్డి, వైసీపి మండల కన్వీనర్ శివరామి రెడ్డి, రఘుమాధవ రెడ్డి, కొర్రపోలూరు సుబ్బారెడ్డి, బండపల్లి రమేష్, క్రిష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, పరమేశ్వర రెడ్డి, వైసీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భిక్షాటన చేసిన అంగన్‌వాడీ ఉద్యోగులు



నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడి ఉద్యోగులు

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎపీ అంగన్‌వాడి వర్కర్స్ మరియు హెల్పర్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడి కార్యకర్తలు 9వ రోజైన బుధవారంనాడు బనగానపల్లె పట్టణంలో భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు పురవీధుల్లో పర్యటించి జోళపట్టి బిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి రోజారమణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

# పేదలకు దుస్తులు పంపిణీ చేసిన చక్రం షబ్బీర్



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రిలో పేదక్రైస్తవులకు ప్రముఖ వ్యాపారవేత్త ముల్లా చక్రం షబ్బీర్ బుధవారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు.త్వరలో క్రిస్మస్ పండుగ ఉండడంతో వీరికి దుస్తులను పంపిణీ చేశారు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగ సందర్భంగా పేద క్రైస్తవులకు ఉచితంగా దుస్తులను ఆయన పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ పండుగ ఎంతో పవిత్రమైందన్నారు. వారు సంతోషంతో క్రిస్మస్ పండుగను జరుపుకోవాలని వారికి ముందస్తు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# 23న భగవద్గీత సహస్ర గళ పారాయణం



కరపత్రాలు అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు సిటీ, మేజర్‌న్యూస్ :** విద్యాప్రకాశానంద గిరి గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో వివిధ ధార్మికం సంస్థల సమన్వయంతో గీతా జయంతి సందర్భంగా ఈ నెల 23న శ్రీభగవద్గీత సహస్ర గళ పారాయణ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు దోమా వేంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏర్పాట్లపై వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి శు బ్రహ్మాశ్రమ ఉత్తర పీఠాధిపతి పూజాశ్రీ సంపూర్ణానందగిరిస్వామి, తిరుపతి శ్రీనివాస మంగాపురం శ్రీ వశిష్టాశ్రమ శ్రీలలితా పీఠ సంస్థాపక పీఠాధిపతి పూజ్యశ్రీ స్వస్వరూపానందగిరి స్వామి, విజయవాడ శ్రీమద్ అష్టాక్షరిపీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్‌స్వామి, సద్గురు భానుమతమ్మ, సుప్రేమానంద, లలితా పీఠం పీఠాధిపతులు మేడా సుబ్రమణ్యంసూత్వామి అనుగ్రహ భాషణం ఉంటుందని తెలిపారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గీతా ప్రచార సంఘం కార్యదర్శులు జగన్నాథగుప్తా, అనంతఅనిల్‌కుమార్, సింహాద్రిరమేష్, మారం అనల్, దక్షిణ షిరిడీ సాయి సేవా సంస్థాన్ మహాబలేశ్వర్, భగవాన్ సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

## నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భోజన ప్యాకెట్లు పంపిణీ




భోజన ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ః** నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమల్ల శ్యామ్ సుందర్ సోదరుడు సునీల్ కుమార్, లావణ్యల కుమార్తె మహీరా జన్మదినాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర 150 మంది బాటసారులకు, యాచకులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశామని నంద్యాల జిల్లా ఆర్యవైశ్యం సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్తా మరియు ఏపీ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వైస్ చైర్మన్ 12వ వార్డు కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి మల్లిపెద్ది నాగరాజు, కోశాధికారి ఇల్లూరి రామకృష్ణ, కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదానానికి రూ.3,50,000లు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న శీలం తిమ్మయ్య కుటుంబ సభ్యులు

**డోన్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని తత్వమసి శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానంకు శీలం తిమ్మయ్య దర్మపత్ని అంజనమ్మ కుమారుడు శీలం భాస్కర్‌నాయుడు బ్రదర్స్ బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ. 3,50,000లు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరి ప్రకాష్, వేల్పుల వెంకటేష్, అర్జున్, ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్రకాష్, సతీష్, శీలం తిమ్మయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమ్మెకు మద్దతునిచ్చిన భూమా కిషోర్ రెడ్డి


అంగన్వాడీల సమస్యలను వింటున్న భూమా కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని అంగన్వాడీలు గత వారం రోజులుగా సమ్మె చేపట్టారు రోజురోజుకీ వారి సమ్మె ఉధృతంగా సాగుతోంది. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా బుధవారం ఆళ్లగడ్డ తాలూకా బిజెపి బాధ్యతలు భూమా కిషోర్ రెడ్డి వారి దీక్ష శిబిరాన్ని సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు ప్రభుత్వం దృష్టికి తెచ్చిన డిమాండ్లలో ఆమోదేయోగ్యంగా ఉన్నాయని ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా అంగన్వాడీలు విధులు నిర్వహిస్తున్నారని వారి డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా బిజెపి నాయకులు అంబటి మహేశ్వర్ రెడ్డి సింగం భరత్ రెడ్డి, సర్వాయి పల్లె రాజ, నాగిరెడ్డిపల్లె శంకర్ రెడ్డి, నాగేశ్వర రెడ్డిలు పాల్గొన్నారు.

## రంగరాజు పేటలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ


బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ ఇందిరమ్మ

**బనగానపల్లెమేజర్,న్యూస్:** బనగానపల్లె పట్టణంలోని రంగరాజుపేట కాలనీలో బుధవారంనాడు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాబోయే 2024 ఎన్నికల్లో వారిని గెలిపించుకోవాలని అలాగే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సూపర్‌సిక్స్ పథకాలను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం నంద్యాల పార్లమెంట్ అద్యక్షులు టంగుటూరి శీనయ్య, పట్టణ అధ్యక్షుడు ఖాసీం బాబు, లాయర్ నాగేంద్ర రెడ్డి, బొబ్బల మహేశ్వర రెడ్డి, మహమ్మద్ హుసేన్, ఖాదర్, ఇస్మాయిల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు సంపూర్ణ మద్దతు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడిలు చేస్తున్న సమ్మెకు జిల్లా ఐఎన్‌టీయూసీ సంపూర్ణ మద్ధతు ఉంటుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న అన్నారు. నగరంలోని ధర్నా చౌక్‌లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడిలకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలకు తమ పూర్తి మద్ధతు ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయుకులు ఆనందం, రాజేంద్రసాద్, జేమ్స్, ఆశీర్వాదం, మహేష్ పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

## భిక్షాటన చేపట్టిన అంగన్‌వాడీ వర్కర్లు



**పాములపాడు, మేజర్ న్యూస్ :** న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం కొనసాగుతున్న నిరవధికసమ్మె బుధవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. తొమ్మిదో రోజు అంగన్వా డీ వర్కర్లు పాములపాడు బస్టాండ్ వద్ద భిక్షాటన గావించారు. కొట్టు కొట్టుకు వెళ్లి రెండు నెలలుగా జీతాలు లేవని తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తమకు ఆర్థిక సహాయం చేయాలని షాపు షాపుకు వెళ్లి భిక్షాటన గావించారు. పలు వురువ్యాపారులు బాటసారి వాహనదారులుఅంగన్వాడి వర్కర్లకు చిల్లర నోట్లుదానం చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని, అంగన్వాడి వర్కర్ల జీతాలు పెంచాలని,న్యాయమైన కోరికలు పరిష్కరించాలనినినాదాలు చేశారు. జరిగిన కార్యక్రమాల్లో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న అంగన్వాడి యూనియన్ నాయకురాలు శివలక్ష్మి, నాగ మద్దమ్మ నాగమణి, శ్రీలత, వెంకటలక్ష్మి, రమణమ్మ బాయ్, పాల్గొన్నారు.

## యువగళం ముగింపు సభతో టీడీపీ విజయం ఖాయమైంది



**గోనెగండ్ల,మేజర్ న్యూస్:** విజయనగరం జిల్లా పొలిపల్లి గ్రామంలో చేపట్టిన యువగళం ముగింపు సభ భారీ సక్సెస్ కావడంతో వైసీపీ నాయకల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయ తీయని ఇక టీడీపీ విజయం ఖాయమని గోనెగండ్ల మండల టీడీపీ కన్వీనర్ నజీర్సాహెబ్, ప్రధాన కార్యదర్శి తిరుపతయ్యనాయుడు అన్నారు. బుధవారం యువగళం ముగింపు సభకు వారు హజరయ్యారు. ఆ సభకు హజరైన జనంకు చూసి ఇంత వరకు కనివిని ఎరుగని రీతిలో ఈ సభ జరిగిందని ఇక వచ్చే ఎన్నికలలో టీడీపీ, జనసేన కూటమి గెలుపు తధ్యమని వారన్నారు. ఈ కార్యక్రమంలో నూరహమ్మద్, రమేష్నాయుడు, రవీక్, భారతం రహంతుల్లా, ఫకృద్దీన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర సంక్షేమం,అభివృద్ధే వైసీపీ ధ్యేయం

**- అభివృద్ధి పనులపై మంత్రి బుగ్గన సమీక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** అభివృద్యే రాష్ట్ర సంక్షేమ అభివృద్ధే ద్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పత్తికొండలో నియోజకవర్గ అభివృద్ధి మండల స్థాయి అధికారులతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి ప్రస్తావించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులను మంజూరు చేయించేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు.రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ జరిగిన తరువాత వచ్చిన మొదటి 5సంవత్సరాలు కీలకమైన సమయమని, ఆ సమయంలో తీసుకున్న నిర్ణయాల ప్రభావం సంవత్సరాల్లో చూడదం జరిగిందన్నాను. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణపై శివరామకృష్ణ కమిటీ అన్ని ప్రాంతాల అభివృద్ధికి రీసెంట్రలైజ్‌డ్‌అడ్మిస్ట్రేట్ అవసరమన్నారు. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాలతోపాటు నార్త్ కోస్తా ప్రాంతాల్లో వికేంద్రీకరణ అవసరమని చెప్పినప్పటికీ ప్రభుత్వం ఇంకోవిధంగా పాలసీలను అమలు చేసిందన్నారు. ఒకేసారి లక్షకుపైగా నిరుద్యోగ యువతకు సచివాలయ ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఉపాధ్యాయులు, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు అందరూ నిబ్బద్ధతో పనిచేయాలన్నారు. కోవిడ్-19 లాంటి భయంకరమైన పరిస్తితుల్లో పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులందరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీదేవి మాట్లాడుతూ, లే అవుట్ లేని గ్రామాలు కూడ ఉన్నాయని, ఆ గ్రామాల్లో అర్హులైన పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించేవిదంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మాట్లాడుతూ, జలజీవన్ మిషన్ కింద 227 పనులలో ఎన్ని టెండర్ పనులు చేశారని, ఇంకాఎన్ని ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈను ప్రశ్నించారు. 104 టెండరు పనులు పూర్తి చేసుకొని 62 పనులు పూర్తయ్యాయని, 18పనులు పురోగతిలో ఉన్నాయని, 24 ఇంకా మొదలు పెట్ట లేదని, 23 టెండర్ పనులు పూర్తి కాలేదన్నారు. జిల్లాకు 530 కోట్లు కేటాయించడం జరిగిందని, జలజీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న టెండరు పనులు కూడ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి, తహశీల్దార్ విష్ణు ప్రసాద్, జిల్లా నియోజకవర్గ మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

## జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు గురురాజా స్కూల్ విద్యార్థుల ఎంపిక

**-క్రీడలు, క్రమ శిక్షణ గురురాజ సొంతం - డైరెక్టర్ షేక్షావలిరెడ్డి**


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

**నంద్యాలనూనెపల్లె, మేజర్‌న్యూస్ :** క్రీడలు, క్రమ శిక్షణ గురురాజ ఇంగ్లీష్ మీడియం సొంతమని డైరెక్టర్ షేక్షావలిరెడ్డి అన్నారు. జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు గురురాజ స్కూల్ క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12 వరకు నంద్యాల కేవీఎం మున్సిపల్ స్కూల్‌లో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. పోటీల్లో అండర్ -14 విభాగంలో అక్షయ జ్యోతి, మణికంఠలు జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 12 నుంచి 14 వరకు కెవిఎం మున్సిపల్ స్కూల్‌లో జరిగిన త్రోబాల్ పోటీల్లో అండర్-17 విభాగంలో పాండురంగ రాష్ట్రస్థాయి త్రోబాల్‌పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 20న పాఠశాల ఆవరణంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న క్రీడాకారులకు డైరెక్టర్ షేక్షావలిరెడ్డి మెడల్స్, ప్రశంస పత్రాలతో క్రీడాకారులను అభినందించి సత్కరించారు.త్రోబాల్ క్రీడలో విజయం సాధించేందుకు కృషి చేసిన వ్యాయా మ ఉపాధ్యాయుడు సుబ్బారావును అభినందించారు.

# ఎస్‌ఎస్ ట్యాంక్ గట్టుకు భద్రత ఏది..?

★ గట్టు కుంగిన చోట నల్లమట్టిని వేసి నామమాత్రంగా పనులు చేసిన వైనం
★ శాశ్వత మరమ్మతుకు నోచుకోని స్టోరేజ్ ట్యాంక్
★ కాంట్రాక్టర్ల,అధికారులు ఇష్టారాజ్యం..వేసవిలో గ్రామాలకు తాగు నీరు ప్రశ్నార్థకం
★ దిగువ కాల్వకు నీటి సరఫరా నిలిచిపోతే ప్రజలకు తప్పని నీటి కష్టాలు


కడ్లేమాగి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఇదే


నామ మాత్రంగా పనులు చేయడంతో మళ్లీ కుంగిన ట్యాంకు గట్టు, గట్టుకు తెగిపోయిన నల్లబండలు

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద సమీపంలో కడ్లేమాగి రస్తాలో గ్రామాల ప్రజలకు దాహర్తిని తీర్చడానికి నిర్మించిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ గట్టుకు భద్రత ఏదిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2015,16వ సంవత్సరంలో నిర్మించిన స్టోరేజ్ ట్యాంక్ గట్టుకు ఒక భాగంలో కొంత మేర కుంగిపోయింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి కుంగిన చోట నల్లమట్టిని వేసి నామ మాత్రంగా పనులు చేపట్టారు. ఆది రెండు రోజులకే మళ్లీ కుంగిపోయింది. ఆ కారణంగా ట్యాంక్‌లో నిల్వ ఉన్న నిటిని కొంత వరకు తగ్గించారు. ట్యాంక్‌కు శాశ్వత మరమ్మత్తు పనులు చేయకుండా కాంట్రాక్టర్ల, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎందుకంటే ఈ నెల 25 వ తేదిన దిగువ కాల్వకు నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. కాల్వకు నీటి సరఫరా నిలిచిపోతే ట్యాంక్‌కు నీటిని నిల్వ చేసుకోలేకపోతే ఈ వేసవిలో గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా ప్రశ్నార్థకంగా మారుతుంది. దాంతో తాగునీటి కోసం ప్రజల తిప్పలు తప్పవని చెప్పక తప్పదు. గత ఏడాది ట్యాంక్‌లో పూర్తీ స్థాయిగా నీరు ఉన్నప్పటికి వేసవి పూర్తీ కాకుండానే ట్యాంక్‌లో నీరు తగ్గిపోవడం జరిగింది. ఇప్పుడు ట్యాంక్‌లో పూర్తీమట్టకు నీరు లేకపోవడంతో వేసవిలో తాగునీటి ఎద్దడి నెలకోవడం తథ్యం. ఆదేవిధంగా ట్యాంక్ గట్టుకు లోపల వేసిన నల్లబండ్లు కూడా తెగిపోయి చెందరవందరగా మారాయి. వెంటనే నిధులు సమకూర్చి గట్టుకు మరమ్మత్తులు చేయాల్సిన అవసర ఏంతైన ఉంది. ఆలాగే గట్టు కుంగిన చోట కింద భాగంలో రాళ్ళతో బండ్‌ను నిర్మించాలి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబధిత ఉన్నాతాధికారులు స్పందించి 11 గ్రామాలకు తాగునీటిని అందించే హొళగుంద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను సందర్శించి ట్యాంక్‌కు శాశ్వత మరమ్మత్తులు చేపట్టి వేసవిలో గ్రామాల వారిగా ప్రజలకు సంపూర్ణంగా తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అంగన్‌వాడీ విధులు అప్పగించవద్దు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :**
ఉపాధ్యాయులకు అంగన్‌వాడీల నిర్వహణ విధులు అప్పగించరాదని బీజేపీ మైనార్టీ మోర్చ రాష్ట్ర నాయకుడు సయ్యద్ ముక్తార్ బాష ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ విధుల నిర్వహణకు ఉపాధ్యాయులు వెళ్లాలని డిఇఓ ఆదేశాలు జారీ చేయడం సరి కాదన్నారు. తక్షణమే ఆదేశాలను వెనక్కి తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి సమ్మె విరమింప చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



### యువగళం ముగింపుకు వెళ్లిన

# బేతంచెర్ల టిడిపి నాయకులు

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ముగింపు కార్యక్రమం విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలపల్లి గ్రామంలో జరుగుతున్న సందర్భంగా బేతంచెర్ల మండలం నుండి టిడిపి నాయకులు భారీ ఎత్తున బయలుదేరారు.యువగళనికి నంద్యాల జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి, బేతంచెర్ల మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, మండల సమన్వయ కమిటీ చైర్మన్ ఉన్నం చంద్రశేఖర్, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, ఉన్నం సుధాకర్, కాకర్ల తిరుమలేష్ చౌదరి, జాకీర్ మాజీ ఎంపీటీసీ, జావాజి వెంకటేశ్వర్లు, మాదినేని నారాయణస్వామి, కౌన్సిలర్ రామాంజనేయులు, రాంగోపాల్, ఎమ్మెస్, డోన్ నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలపాలపల్లి పిక్కిలి అంజి, జీవన్ చౌదరి, దూదేకుల దస్తగిరి, కానాల అంజి కార్యకర్తలు పెద్ద ఎత్తున బయలుదేరారు.

## అమ్మోరు వేషంలో అంగన్‌వాడీల నిరసన



అమ్మోరు వేషంలో అంగన్‌వాడీలు

**ఆలూరు,మేజర్ న్యూస్ :** అంగన్ వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ఏపి అంగన్వాడీ వర్కర్స్ %ూ% హెల్పర్స్ యూనియన్ నాయకులు అమ్మోరు వేషంతో వేపాకు చేతబట్టి తమకు సీఎం జగన్ అన్యాయం చేశారని మా డిమాండ్ లు నెరవేర్చక పోతే అమ్మోరు సీఎం కు శాపం పెడతారని అంగన్ వాడి కార్యకర్త బాల రంగమ్మ,పుష్ప లు అన్నారు.బుధవారం అంగన్ వాడీ తాలుకా కార్యదర్శి జయశ్రీ,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామిల ఆధ్వర్యంలో 9వరోజు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మెలో భాగంగా అంగన్వాడీలు వినూత్నంగా అమ్మోరు పలికినట్లు పలికారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి తెలంగాణలో కంటే ఎక్కువ వేతనాలు పెంచుతానని, ఉద్యోగ భద్రత,అర్హులకు ప్రమోషన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్,పెన్షన్ కల్పిస్తానని మాట ఇచ్చి మరిచారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి లకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని ,తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ లు ఇవ్వాలన్నారు. . మిని అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీలో చేర్చాలని, వర్కర్లకు హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని , ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిఐటియు తాలూకా నాయకులు కృష్ణ. అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, లీలావతమ్మ. సరోజమ్మ, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, వెంకటలక్ష్మి, సరస్వతి, నిర్మల, ఈరమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కురువ సంఘం మహా సింహ గర్జన సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కురువ సంఘం న్ాయకులు మాజీ ఎంపిపి బసప్ప

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గం కేంద్రంలో మదాసి,మదారి కురువ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు మాజీ ఎంపిపి బసప్ప, వైస్ ఎంపీపీ వన్నూరప్ప, రాం మోహన్,తాలూక కమిటీ నాయకులు కౌడికే రాజు, మల్లయ్య, బసవ, ఎస్కే. గిరి, పంపన్నలు పాల్గొన్నారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన ఆదివారం రోజున ఆలూరులో మొలగవల్లి శశికళ కృష్ణమోహన్ గారి ఆధ్వర్యంలో కురువ మహా సంహా గర్జన సభ తలపెట్టడం జరిగిందని ఈ సభకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక నుంచి ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని అలాగే మదాసి%ూ%మదారి కురువలు భారి ఎత్తున పార్టీల కతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. మదాసి, మదారి కురువ కుల సర్టిఫికెట్ సాధన ధ్యేయంగా ఈ భారీ బహిరంగ సభ ద్వారా మనమందరం ముక్తకంఠంతో పిలుపునివ్వాలని అన్నారు. సమావేశంలో కమ్మరిచేడు దేవేంద్రప్ప, చింతకుంట వీరేష్, గోవిందు, గోబీ బసవరాజు, టీచర్ శ్రీనివాసులు, రమేష్, మరి మల్ల, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఆస్పరిలో ముఖ్యమంత్రి జగనన్న

# జన్మదిన వేడుకలు నిర్వహించనున్న జడ్పిటిసి విరుపాక్షి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పిటిసి విరుపాక్షి( ఫైల్)

**చిప్పగిరి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన ఆస్పరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఉమ్మడి కర్నూల్ జిల్లా పంచాయతీ రాజ్ జోనల్ వింగ్ అధ్యక్షులు జడ్పిటిసి విరుపాక్షి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ జగనన్న జన్మదిన వేడుకల సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారని వైసీపీ శ్రేణులు తెలిపారు.అలాగే ఇటీవల ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ పార్టీలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని అయితే జగన్ బర్త్ వేడుకలను కేంద్రంగా చేసుకుని వైసీపీ టికెట్ ఆశిస్తున్నా ఆశావాహులు తమతమ బలాలను చూపించుటకు రంగం సిద్ధం చేశారు.అందులో భాగంగా ఇటీవల ఎమ్మిగనూరు సభలో విరుపాక్షిని సీఎం జగన్ ఆలూరు నియోజకవర్గంలో పూర్తిగా తిరగాలని ఇంకా పార్టీని అభివృద్ధి చేయాలని సూచించడంతో పాటు నీకు నేను ఉన్నానని హామీ ఇచ్చినట్లు తెలిసింది.దీంతో అప్పటికే నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రతి ఒక్క గ్రామంలో దేవాలయాలకు, పాఠశాలలకు, ఇబ్బందులలో ఉన్న వారిని అదుకోవడంలో ముందున్న విరుపాక్షికి వైసీపీ పార్టీ త్వరలో పెద్ద బాధ్యతలను ఇవ్వనున్నట్లు గుసగుసలు వినపడుతున్నాయి. ఒకపక్క మంత్రి జయరాం కూడా సీఎం జగన్ ను సోమవారం కలిసి తనకు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అయితే దానిపై సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వినపడుతున్నాయి. ఏది ఏమైనా ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగనన్న జన్మదిన వేడుకలను వైసీపీ నాయకులు,టికెట్ ఆశిస్తున్న ఆశావాహులు భారీ ఎత్తున జరపడానికి పోటీలు పడుతున్నారు.సీఎం బర్త్ డే వేడుకలు ఘనంగా జరిపి పార్టీకి,వైసీపీ నాయకులకు, కార్యకర్తలు కు ఒక సందేశం ఇవ్వడానికి నాయకులు సిద్ధం అయ్యారు. అలాగే సీఎం జగనన్న కూడా తన పుట్టిన రోజు టికెట్ ఆశిస్తున్న నేతలకు ఒక శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తుంది.ఇప్పటికే ఒక జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం.నేడు జరగబోయే జగనన్న జన్మదిన వేడుకల్లో ఏ నాయకుడిని కార్యకర్తలు, ప్రజలు ఆదరిస్తారో వేచి చూడాలి.

## అంగన్‌వాడీల నిరసనకు చిన్నారుల తల్లుల సంఘీభావం



అంగన్‌వాడీల దీక్షాశిబిరంలో చిన్నారులు, తల్లులు, గర్భిణీ స్త్రీలు

**దొర్నిపాడుమేజర్,న్యూస్:** రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడి టీచర్లు , ఆయాలు చేపడుతున్న నిరసనలకు చిన్నారుల తల్లులు సంఘీభావాన్ని తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన దొర్నిపాడు తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో 9వ రోజు ఏపీ అంగన్‌వాడి టీచర్స్, ఆయాలు జరుపుతున్న సమ్మెలో వివిధ అంగన్‌వాడి సెంటర్ల నుండి బాలింతలు, గర్భిణీలు, చిన్న పిల్లల తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు , చిన్న పిల్లల తల్లులు మాట్లాడుతూ మాకు టీచర్స్, ఆయాలు చేపడుతున్న సమ్మె వలన మాకు చాలా ఇబ్బందిగా ఉందని రోజువారి పని చేసుకుంటే తప్ప మాకు ఇళ్లు గడవడం కష్టంగా ఉందని చిన్న పిల్లల్ని టీచర్‌లకు, ఆయాలకు అప్పజెప్పి చిరు వ్యాపారం, కూలి పనికి పోతూ జీవనం సాగిస్తున్నామని అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు సమ్మెలో పాల్గొనడం వల్ల నిండు గర్భిణీ బాలింతల చంటి పిల్లలను చూసుకోవడం వలన పనికి పోవడానికి ఇబ్బందిగా ఉందని అందు వలన ప్రభుత్వాన్ని మేము ఒకటే కోరుతున్నాము టీచర్లు, ఆయాలు సంబంధించిన వారి న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని వారన్నారు. వారికి కనీస వేతనాలను పెంచుతూ పెన్షన్ అలవెన్సులు కల్పించాలని చిన్నారులు సైతం ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్. ఉదయలక్ష్మి, జి. మాధవి, టీచర్స్ అరుణ కుమారి, బి. వెంకటసుబ్బమ్మ, తులసమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి, మంజుల, దానమ్మ, ఈశ్వరమ్మ, లావణ్య, విజయలక్ష్మి, మహాలక్ష్మి, శారద, రాజేశ్వరీ, మల్లేశ్వరీ, సుభాషిని, మార్తమ్మ, సరోజినిబాయి, లీలావతమ్మ, జ్ఞానమ్మ, ఉమాదేవి, పద్మావతి, మండ్ల వెంకటసుబ్బమ్మ, హెల్పర్స్ పాల్గొన్నారు.

## బీజేపీ మహిళా కమిటీల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న బి.వి సుబ్బారెడ్డి

**బనగానపల్లెరూరల్,న్యూస్ :** బనగానపల్లె భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివక్రిష్ణ యాదవ్, మండలాధ్యక్షులు యాదగిరి, కన్వీనర్ బి.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గంలోని 5మండలాల మహిళా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్యవర్గ సభ్యులు శ్రీలక్ష్మి , రాజేశ్వరమ్మ, మైనార్టీ మహిళా కార్యవర్గ సభ్యురాలు చాందిని తదితరులు పాల్గొన్నారు.

## భిక్షాటన చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

**బండిఆత్మకూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర అంగన్‌వాడి సంఘం పిలుపు మేరకు 9వరోజు బండి ఆత్మకూరు మండలంలో అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యల డిమాండ్లను పరిష్కరించే వరకు తమ నిరసన కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయని వివిధ రూపాల్లో వినూత్నంగా నిరసన తెలిపారు. బుధవారం మండల రెవెన్యూ కార్యాలయం నుండి స్థానిక బస్టాండు ఆవరణలో భిక్షాటన చేస్తూ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వీరికి సీఐటీయ జిల్లా నాయకులు గౌస్‌తో పాటు మండల నాయకులు రత్నమయ్య, రాజు పాల్గొని ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు రమణమ్మ, ఆనందమ్మ, వసంత, రేష్మా, రుక్సానా, ముబీనా, శ్యామల, అరుణకుమారి, సరిత, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విజేతలను అభినందించిన ఎమ్మెల్యే

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ఖేలో ఇండియా రగ్బీ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభినందించారు. ఈ 18 నుంచి 20వతేదీ వరకు జరిగిన రగ్బీ పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పాఠశాల విద్యార్థులు పాల్గొని మంచి ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. దీంతో వారిని ఎమ్మెల్యే కాటసాని, కేజేఆర్ బిల్డర్స్ అధినేత కేజే.రెడ్డి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

## ముగిసిన కౌశల్ 2కే23
# క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నగర శివారులోని రవీంద్ర గ్లోబల్ స్కూల్‌లో బుధవారం కౌశల్ 2కే23 క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డి హాజరయ్యారు. రవీంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ వీఎం.మోహన్‌కుమార్ విశిష్ట అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తి బయటకు రావాలంటే ఇలాంటి పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభను కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మండల ఎంఈవో వినోద్‌కుమార్, రాష్ట్ర కౌశల్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ కుమార్‌బాబు, జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ, రిడ్జ్ స్కూల్ సీఈవో గోపినాథ్, రవీంద్ర గ్లోబల్ స్కూల్ సీఈవో వంశీధర్, వివిధ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆధునిక టెక్నాలజీతో విద్యార్థులకు బోధన

**కల్లూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీతో బోధన చేస్తుందని కల్లూరు మండల విద్యాధికారులు ఎం.శ్రీని వాసులు, వనజకుమారి అన్నారు. బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో 8వతరగతి విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


ట్యాబ్‌లు అందజేస్తున్న దృశ్యం

# కొనసాగుతున్న న్యాయవాదుల రిలే నిరాహారదీక్షలు


దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

**కర్నూలులీగల్, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కర్నూలు నగరంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలు బుధవారం 10వరోజుకు చేరుకున్నాయి. న్యాయవాదులు రామశేషన్న, ఖాద్రి, రమణారెడ్డి, ఆల్బర్ట్, గోపాల్, క్రిష్ణయ్య, అలీబాష దీక్షలో కూర్చున్నారు. ప్రభుత్వం వెంటనే జీవో 512ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు కాంగ్రెస్, రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల పరిశీలన

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్:** జిల్లా పర్యటనలో ఉన్న ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బుధవారం నగరంలోని 64, 65, 66, 67, 68, 69వ పోలింగ్‌కేంద్రాలను తనిఖీ చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాల పరిష్కార తీరును ఆయా పోలింగ్‌కేంద్రాల బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యంతరాలను క్షేత్రస్థాంలో అత్యంత పారదర్శకంగా పరిశీలించి తగిన సిఫారసులు చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అర్బన్ తహసీల్దార్ విజయశ్రీ, ఎన్నికల డీటీ ధనుంజయ పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
## ఎమ్మెల్యే శ్రీదేవమ్మ


ఎమ్మెల్యే శ్రీదేవమ్మను సన్మానిస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలో రైతుల అభివృద్ధికి వైకాపా ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీదేవమ్మ అన్నారు. రాంపురం గ్రామానికి చెందిన గంగాధర్‌కు వైకాపా బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా, సర్పంచ్ షేక్ లడ్డక వ నాల్ బాషకు వైకాపా మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా, రాంపురం కొట్టాలకు చెందిన సయ్యద్‌హుస్సేన్‌బాషకు వైకాపా మైనార్టీ సెల్ జిల్లా సహాయ కార్యదర్శిగా పదవులు రావడంతో బుధవారం ఎమ్మెల్యే శ్రీదేవమ్మను వారు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి సీఎం వైఎస్‌జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సలహాదారుడు గోవిందరాజులు, ఫీల్డ్‌అసిస్టెంట్ బద్రి పాల్గొన్నారు.

# రోగులకు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలి
## – జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య


రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

**తుగ్గలి, మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, వైద్యసిబ్బంది గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య అన్నారు. బుధవారం తుగ్గలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజకలు అందుతున వైద్యసేవల పట్ల ఆయన సంతృప్తి వ్యక్త ంచేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ప్రతిమ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీ మహాలక్ష్మి సమేత మద్దిలేటిస్వామి
# ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు



**(మొదటిపేజీ తరువాయి)**

ఉదయం శ్రీ స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలైన శ్రీ స్వామివారి అనుజ్ఞ, గోపూజ, విశ్వక్సేనారాధన సాయంత్రం రక్షాబంధనం దీక్ష హోమములు, విశేష పుష్పాలంకరణ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ పూజల అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని హనుమద్ వాహన సేవపై ఊరేగింపు, రాత్రి భక్తుల కాలక్షేపం నిమిత్తం జబర్దస్త్ జీవన్ టీం వారిచే జానపద సినీ ఆర్కెస్ట్రా కార్యక్రమం ఉన్నట్లు తెలిపారు. 22వ తేదీ మార్గశిర మాస శుద్ధ దశమి శుక్రవారం ఉదయం స్వామి అమ్మవారికి పుణ్యాహవచనం, లక్ష తులసీ దళార్చన స్నపనతిమంజనం, శ్రీ సుదర్శన హోమం, సాయంత్రం ప్రత్యేక పూజలైన సహస్ర దీపాలంకరణ మహా మంగళహారతి సేవా అనంతరం గజవాహనంపై స్వామి, అమ్మవారిని ఊరేగింపు, రాత్రి భక్తుల కాలక్షేపం నిమిత్తం శ్రీకృష్ణ తులాభారం అలక సీను, భక్త చింతామణి పూర్తి నాటకం ఉన్నట్లు తెలిపారు. 23వ తేదీ మార్గశిర మాస శుద్ధ ఏకాదశి శనివారం తెల్లవారుజామున 3.00 గంటలకు శ్రీ మద్దిలేటి స్వామి వారి ధ్రువ మూర్తికి స్నపన తిరమంజనం, విశేష పుష్పాలంకరణ సేవ, ఉదయం 4.00 గంటలకు తులాలగ్న శుభపుష్కరాంశము యందు ఉత్తర ద్వారం నుండి శ్రీ స్వామివారి దర్శనము, ఉదయం10.00 గంటలకు కళ్యాణ వేదికకు ఉత్సవ మూర్తుల వైభవంగా ఊరేగింపు అనంతరం లోక హితం కోసం శ్రీ దేవి,భూదేవి సమేత శ్రీ స్వామి అమ్మవార్లకు శాంతి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా జరుగునని తెలిపారు. శ్రీ హయగ్రీవాచార్యులు (తి.తి.దే) వారిచే కళ్యాణ ఘట్ట ప్రవచనము ఉన్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఆర్ఎస్. రంగాపురం గ్రామ పురవీధుల గుండా శ్రీ స్వామి వారి రథోత్సవం,రథోత్సవం వెంట శ్రీ సీతారామ కోలన్న ,బ్రహ్మణక్రాక కళాబృందం వారిచే కోలాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



**22న బండలాగుడు, కబడ్డీ పోటీలు :** ఉత్సవాలను పురస్కరించుకొని ఆరు పండ్ల విభాగమునకు (14.ఘ.అ) చెందిన వృషభరాజములకు బండలాగుడు పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి రూ 40 వేలు, రెండవ రూ. 30 వేలు, మూడో రూ 20 వేలు, నాల్గవ రూ.15 వేలు, ఐదవ రూ.10 వేలు,ఆరవ రూ.8 వేలు,ఏడవ రూ 5 వేలు,ఎనిమిది రూ.3 వేలు,తొమ్మిదవ రూ 2 వేలు బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు.

**జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు :** జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి రూ.10 వేలు,రెండవ రూ.8 వేలు,మూడవ రూ.6 వేలు,నాల్గవ రూ.4 వేలు,ఐదవ రూ.2 వేలు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

**23న న్యూ క్యాటగిరి విభాగమునకు చెందిన వృషభరాజములకు పోటీలు :** న్యూ క్యాటగిరి విభాగమునకు బండ సైజు (16 ఘ.అడుగులు) గెలుపొందిన వృషభరాజములకు మొదటి రూ.55 వేలు, రెండవ రూ.40 వేలు,మూడవ రూ 30 వేలు, నాల్గవ రూ.20 వేలు,ఐదవ రూ 15 వేలు,ఆరవ రూ.10 వేలు,ఏడవ రూ.5 వేలు, ఎనిమిదవ రూ.3 వేలు బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు.పోటీలలో పాల్గొనే వారు 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ప్రవేశ రుసుం చెల్లించాలని తెలిపారు. కబ్బడి జట్లు రూ.400, బండలాగుడు పోటీలకు రూ.600 లు చెల్లించాలని వివరాలకు 91606 38848 ,77994 89266 , 96526 97198, 99634 29928 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

**జంతు బలి నీషేదం :** ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని 21వ తేదీ నుండి 23 వ తేదీ వరకు క్షేత్రంలో జంతు బలి నిషేదామని కావున భక్తులు సహకరించాలని కోరారు.

**ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు**
**ఆలయ ఈ ఓ డీ.పాండురంగారెడ్డి**



నేటి నుంచి ప్రారంభమయ్యే ముక్కోటి ఏకాదశి మహోత్సవాలకు ఆయా శాఖల అధికారులు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ , వైద్యఅధికారుల సమన్వయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ,రాష్ట్ర స్థాయి బండలగుడు పోటీలు,జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి –**
**ఆలయ ఛైర్మెన్ బి.సీత రామచంద్రుడు**



ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఉత్తర ద్వారా దర్శనంలో ఇబ్బం దులు లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశామని, మూడు రోజుల పాటు ఉచిత అన్నదానం, కళ్యాణం రోజున ఆర్ ఎస్. రంగాపురం నుండి ఆలయం వరకు ఉచిత ఆటో సౌకర్యం కల్పిస్తున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూర్య
గురువారం 21 డిసెంబర్ 2023

# ఆటో సిటీ..కర్నూలు..!

– 35వేల ఆటోలతో రికార్డు



ఆటోలతో నిండిపోయిన కర్నూలు నగరం

**కర్నూలు, సూర్య ప్రత్యేక ప్రతినిధి :** కర్నూలు నగరాన్ని సామాజిక మాధ్యమాల్లో ఆటో సిటీ అంటూ ముద్దు పేరు పెట్టుకున్నారు నెటిజన్లు. కర్నూలు నగరంలో ఎక్కడ చూసినా ఆటోలే కనిపిస్తాయని వారు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇందుకు కారణం నగరంలో 35వేల ఆటోలు తిరుగుతుండటమే కారణం. ఇన్ని ఆటోలు ఉన్నందువల్లే ఆటో సిటీ అంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు. అలా ఎందుకు అంటే పింక్ సిటీ, గ్రీన్ సిటీ అంటూ పెద్ద నగరాలకు ఉన్నట్లే మా నగరానికి మేము పెట్టుకున్నాము అంటూ సమాధానం ఇస్తున్నారు. కర్నూలు నగరంలో రాత్రి, పగలు తిరిగే షేర్ ఆటోలు 35వేల వరకు ఉన్నాయి. కర్నూలు నగర జనాభా సుమారు 6లక్షలు. ఇక కర్నూలు నగరానికి పని మీద వచ్చి వెళ్లే వారు సగటున రోజుకు 30వేల మంది వరకు ఉంటారని అంచనా. దీంతో ప్రతి 18 మందికి ఒక ఆటో ఉందని పోలీసులు లెక్కలు చెబుతున్నారు. షేర్ ఆటోలు కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే సెవెన్ సీటర్ ఆటోలు అదనమని వారంటున్నారు. ఏదేని కారణంతో కర్నూలులో ట్రాఫిక్ జామ్ అయితే కనిపించే ఆటోలను చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవలసిందే..!

# చిరుత దాడిలో గొర్రె పిల్ల మృతి

– చిరుతల సంచారంతో భయకంపితులవుతున్న పెంపకం దారులు



చిరుత తిని వదిలేసిన గొర్రె పిల్ల కళేబరం

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని తురవగల్లు గ్రామంలో ఊరికి అనుకొని ఉన్న కొండకు సమీపంలో తన గొర్రెల మందను వామిదొడ్డిలో నిలిపి ఉండగా, మంగళవారం రాత్రి చిరుత గొర్రెలపై దాడి చేసి గొర్రెపిల్లను చంపింది. చిరుత దాడి చేయగా, ఒక్కసారిగా గొర్రెలు బెదిరిపోగా, గొర్రెపిల్ల చిరుత చేతికి చిక్కింది. చిరుత గొర్రె పిల్లను తిని కళేబరాన్ని వదిలి వెళ్లింది. బుధవారం ఉదయం నల్లన్న నిద్రలేచి గొర్రెల మందను చూసుకోగా, ఒక గొర్రె పిల్ల మృతి చెందిన సంఘటనను గుర్తించారు. ఇప్పటివరకు మండలంలో 20చోట్ల ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కానుండడంతో గొర్రెలు, మేకల పెంపకందారులు బెంబేలెత్తిపోతున్నారు.

# మంచి చేసే మాపై పాస్టర్ల దీవెనలు ఉండాలి: టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** మంచి చేసే తమపై పాస్టర్ల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జి టీజీ భరత్ అన్నారు. నగరంలోని మౌర్య ఇన్ పరిణయ హాల్‌లో బుధవారం పాస్టర్లతో క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమం టీజీ భరత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు, వారి కుటుంబం సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి అనం తరం కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కులాలకు అతీతంగా సంతోషంగా జరుపుకునే పండుల్లో ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. ఈ నెల మొత్తం పండుగ వాతావరణం ఉంటుందన్నారు. ఏసు చెప్పిన మంచి వ్యాఖ్యలను తన జీవితంలో పాటిస్తున్నట్లు తెలిపారు. మనతోపాటు అందరూ బాగుండాలని దేవుడిని కోరుకోవాలన్నారు. ఇటీవలే బుధవారపేటలో చర్చి నిర్మాణానికి తాను సహాయం చేసిన`ట్లు తెలిపారు. కర్నూలులోని ప్రజలకు అవసరమైనప్పుడు ఏదో విధంగా సహాయం చేయాలని తాము అనుకుంటామన్నారు. సేవ చేసేందుకే రాజకీయాల్లో ఉన్నట్లు తెలిపారు. తాను క్రిస్టియన్ పాఠశాలలో చదివే రోజుల్లో ఆదివారంరోజు చర్చికి వెళ్లి ప్రార్థనల్లో



క్యాండిల్ లైటింగ్ వేడుకల్లో టీజీ భరత్

పాల్గొన్న సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. అనంతరం పాస్టర్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌రావు, ఫెడ్డి పాల్, విజయ్‌కుమార్, అస్కనాజ్, దేవసహాయం, ఆనందరావు, కరుణ సాగర్, రాజశేఖర్, ఏసురత్నం, అంతోని, కిరణ్‌కుమార్, అజయ్‌కుమార్, ప్రకాష్, రాజ్‌కుమార్, సురేం ద్ర, శివ, ఏసన్న, దినేష్ పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయండి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10వతేది వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్

ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, జడ్పీ డిప్యూటి సిఇఓ సుబ్బారెడ్డి, జిల్లా క్రీడా ప్రాధికార అధికారి రాజులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26వతేది నుంచి ఫిబ్రవరి 10వతేది వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీలలో టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసుకొని విజయవంతంగా క్రీడల పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఆటస్థల మైదానాలను పరిశీలించి గుంతలు లేకుండా చదును చేసుకో వడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మారుతున్న జీవనశైలిలోని ఒత్తిడిని దూరం చేసేందుకు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ద్వారా గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించడం జరుగుతుంద న్నారు. గ్రామ స్థాయిలో పాల్గొని గెలిచిన వారికి మండల స్థాయిలో, మండల స్థాయిలో గెలిచిన వారికిజిల్లా స్థాయిలో,జిల్లాస్థాయిలోగెలిచినవారికిరాష్ట్రస్థాయిలోపాల్గొనేఅవకాశం ఉంటుందన్నారు.

## యువగళం సభతో

# వైసీపీ పతనం మొదలు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** యువగళం సభతో వైసీపీ పతనం మొదలవు తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 226రోజులపాటు 97నియోజకవర్గాల్లో, 2100గ్రామాల్లో 3132కిలోమీటర్ల మేర దిగ్విజయంగా సాగిందన్నారు. నారాలోకేష్ తన పాదయాత్రలో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు పడుతున్న ఇబ్బందులు, కష్టాలు అన్ని తెలుసుకున్నారన్నారు. పాదయాత్ర ముగింపు సభ నభూతో నభవిష్యత్ అన్న రీతిలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభతో వైసీపీలో టికెట్‌లో కోసం దరఖాస్తు చేసుకునే వారే ఉండరన్నారు. ఈ సభ విజయవంతం ద్వారా వైసీపీ పతన మొదలవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

# రాబోయే రోజులలో పత్తికొండ అభివృద్ధిని అడ్డుకోవడం అసాధ్యం

**జిల్లాలోనే పత్తికొండ నియోజకవర్గాన్ని**
**అభివృద్ధికి నిదర్శనంగా చేస్తాం**
**వెల్దుర్తి మండలం పై సిఎం జగన్ ప్రత్యేక చొరవ ఉంది**
**మునుపెన్నడూ చూడని అభివృద్ధిని**
**పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో**
**చూస్తారు..**
**మంత్రి బుగ్గన, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ**

**వెల్దుర్తి, వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్:** కర్నూలు జిల్లాలోనే పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడం ఎవ్వరితరం కాకుండా,నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వసతులు, సౌకర్యాలను రాబోయే రోజులలో కల్పించబోతున్నామని, గతానికి, రాబోయే రోజులలో జరిగే అభివృద్ధిని చూస్తే పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధికే నిదర్శనంగా నిలవబోతుందని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మలు అన్నారు.బుధవారం పత్తికొండ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండల కేంద్రంలో మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కొరకు రూ. 5.77 కోట్లతో నూతనంగా నిర్మించిన 30 పడకల సిహెచ్‌సి ఆసుపత్రిని, ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేసేందుకు రూ. 12కోట్లతో వెల్దుర్తి మండల కేంద్రం నుండి రామళ్ళకోట గ్రామం వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర నిర్మించిన రోడ్డును పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్యలతో కలిసి ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి పాతబస్టాండ్ నందు ఏర్పాటు సభను ఉద్దేశించి, ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ రెడ్డి, పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మలు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోనే పత్తికొండ నియోజకవర్గంలోని మండలాలు అభివృద్ధికి నోచుకోలేదని, అయితే 2019 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన వైయస్ఆర్ పార్టీ హయాంలో పత్తికొండ నియోజకవర్గ ప్రజలకు ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నేడు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను, పనులను ప్రారంభించి, నేడు వాటిని వినియోగించుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. పత్తికొండ నియోజకవర్గం గతంలో ఎందరికో రాజకీయ భిక్ష పెట్టిందని, అయితే కేవలం గత పాలకులు వారి స్వార్థం చూసుకున్నారే తప్పా వారిని నమ్ముకున్న, వారికి అండగా ఉన్న ప్రజలను, వారు ఎదుర్కుంటున్న సమస్యలను గాలికి వదిలేయడం జరిగిందన్నారు. అలాగే నేడు పత్తికొండ నియోజకవర్గంలోని అనేక మండలాలలోని గ్రామాలు అభివృద్ధికి చిరునామాగా నిలుస్తున్నాయని, మండల కేంద్రాలలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం వైయస్ఆర్ పార్టీ ఒక్కటేనన్నారు. పాదయాత్రలో భాగంగా పత్తికొండ నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు పత్తికొండ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి కళ్ళారా చూశారని, 2019 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన తరువాత పత్తికొండ నియోజకవర్గంపై ఆయన చూపిస్తున్న చొరవతోనే నేడు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. అదేవిధంగా వెల్దుర్తి మండల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన 30 పడకల సిహెచ్‌సి ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, నిత్యం వైద్యులు ప్రజలకు సేవలు అందించడానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే ఎన్నో దశాబ్దాలుగా వెల్దుర్తి మండల కేంద్రం నుండి రామళ్ళకోట గ్రామం వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారినా, పట్టించుకున్న పాపాన గత పాలకులు చేయలేదని, కాని నేడు పది కిలోమీటర్ల మేరా గ్రామంలోకి నూతనంగా రోడ్డును నిర్మించి, ప్రజలకు, ప్రయాణికులకు, వాహనదారుల సమస్యలను తీర్చుడం జరిగిందన్నారు. అలాగే రాబోయే రోజులలో మరింత మెరుగైన అభివృద్ధిని పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రజలు చూడాలన్నా, అభివృద్ధి, సంక్షేమ ఫలాలను మరోసారి నేరుగా అందుకోవాలన్నా రాష్ట్రంలో మరోసారి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి సిఎం కావాలని, అందుకు పత్తికొండ నియోజకవర్గంలో వైయస్ఆర్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు ప్రజలు సన్నద్ధం కావాలని, పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైకాపా కార్యదర్శి కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, వెల్దుర్తి మండల వైకాపా కన్వీనర్ బొమ్మన రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పిటిసి సుం కన్న, వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ ముత్యాల శైలజ, వెల్దుర్తి మండల వైకాపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



పడకల సిహెచ్‌సిని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, వైకాపా నాయకులు




నూతనంగా నిర్మించిన 30 పడకల వెల్దుర్తి సిహెచ్‌సి ఆసుపత్రి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ